బెంగళూరు టాప్‌షో

గుజరాత్‌పై ఘనవిజయం • డబ్ల్యూపీఎల్ రెండో సీజన్

స్మృతి (43)

బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) రెండో సీజన్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు వరుసగా రెండో విజయం సాధించింది. మంగళవారం జరిగిన పోరులో బెంగళూరు 8 వికెట్ల తేడాతో గుజరాత్ జెయింట్స్‌ను చిత్తుచేసింది. ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన స్మృతి మంధన సారథ్యంలోని బెంగళూరు పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 107 పరుగులు చేసింది. హేమలత (31) టాప్ స్కోరర్ కాగా.. కెప్టెన్ బెత్ మూనీ (8), లిచ్‌ఫీల్డ్ (5), వేద కృష్ణమూర్తి (9), ఆష్లే గార్డ్‌నెర్ (7), క్యాథరిన్ బ్రైస్ (3) విఫలమయ్యారు. బెంగళూరు బౌలర్లలో సోఫియా 3, రేణుక రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో బెంగళూరు 12.3 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 110 రన్స్ కొట్టింది. ఓపెనర్ స్మృతి మంధన (27 బంతుల్లో 43; 8 ఫోర్లు, ఒక సిక్సర్), సబ్బినేని మేఘన (36 నాటౌట్) మెరుపులు మెరిపించారు. రేణుకకు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు దక్కింది. లీగ్‌లో భాగంగా బుధవారం యూపీతో ముంబై తలపడనుంది.

మెయిన్ 'డ్రా'కు శంకర్

న్యూఢిల్లీ: భారత యువ షట్లర్ శంకర్ ముత్తుస్వామి జర్మనీ ఓపెన్ మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించాడు. బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్-300 టోర్నీలో క్వాలిఫయింగ్ టోర్నీలో 20 ఏండ్ల శంకర్ సత్తాచాటాడు. తొలి మ్యాచ్‌లో శంకర్ 21-17, 21-10తో షెఫర్ (జర్మనీ)పై, రెండో రౌండ్‌లో 21-11, 21-18తో టాబిస్ కొంజీ (స్విట్జర్లాండ్)పై గెలిచి ప్రధాన టోర్నీలో అడుగుపెట్టాడు.

అరుంధతికి జరిమానా

బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో హైదరాబాదీ పేసర్ అరుంధతి రెడ్డిపై జరిమానా పడింది. లీగ్ రెండో సీజన్‌లో భాగంగా.. సోమవారం యూపీ వారియర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో నిబంధనలు అతిక్రమించినందుకు గానూ నిర్వాహకులు ఈ ఢిల్లీ పేసర్ మ్యాచ్ ఫీజులో 10 శాతం కోత విధించారు. ప్రత్యర్థి బ్యాటర్‌ను ఔట్ చేసిన అనంతరం అరుంధతి పరుష పదజాలం వినియోగించడంతో ఈ శిక్ష పడింది.

33 బంతుల్లో సెంచరీ

టీ20ల్లో వేగవంతమైన శతకం

నమీబియా ప్లేయర్ నయా రికార్డు

నికోల్ (101)

కీర్తిపూర్ (నేపాల్): అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో నమీబియా ప్లేయర్ జాన్ నికోల్ లాఫ్టీ ఈటన్ చరిత్ర సృష్టించాడు. 33 బంతుల్లో సెంచరీ బాది వేగవంతమైన సెంచరీ తన పేరిట రాసుకున్నాడు. మంగళవారం నేపాల్‌తో జరిగిన పోరులో నికోల్ లాఫ్టీ (36 బంతుల్లో 101; 11 ఫోర్లు, 8 సిక్సర్లు) విశ్వరూపం కనబర్చాడు. బౌండ్రీల ద్వారానే 92 పరుగులు సాధించి ప్రత్యర్థి బౌలర్లను చీల్చి చెండాడాడు. ఫలితంగా నమీబియా జట్టు 20 పరుగుల తేడాతో నేపాల్‌ను చిత్తుచేసింది. గతంలో అంతర్జాతీయ టీ20ల్లో వేగవంతమైన శతకం నేపాల్ ప్లేయర్ కుశాల్ మల్లా (34 బంతుల్లో; మంగోలియాపై) పేరిట ఉంది. భారత కెప్టెన్ రోహిత్ శర్మ, డేవిడ్ మిల్లర్ 35 బంతుల్లో సెంచరీలు బాదారు.

ఫాస్టెస్ట్ సెంచరీ వీరులు

ప్లేయర్	దేశం	బంతులు	ప్రత్యర్థి
జాన్ నికోల్	నమీబియా	33	నేపాల్
కుశాల్ మల్లా	నేపాల్	34	మంగోలియా
మిల్లర్	దక్షిణాఫ్రికా	35	బంగ్లాదేశ్
రోహిత్	భారత్	35	శ్రీలంకపై
విక్రమశేఖర	చెక్ రిపబ్లిక్	35	టర్కీ

షమీకి శస్త్రచికిత్స.. ఐపీఎల్‌కు దూరం!

న్యూఢిల్లీ: టీమ్‌ఇండియా స్టార్ పేసర్ మహమ్మద్ షమీ మోకాలికి శస్త్రచికిత్స జరిగింది. నిరుడు స్వదేశంలో జరిగిన వన్డే ప్రపంచకప్‌లో 7 మ్యాచ్‌ల్లోనే 24 వికెట్లు పడగొట్టి.. భారత జట్టు ఫైనల్‌కు చేరడంలో ప్రధాన పాత్ర పోషించిన 33 ఏండ్ల షమీ.. ఆ తర్వాత గాయం కారణంగా జట్టుకు దూరమయ్యాడు. మంగళవారం జరిగిన సర్జరీ విజయవంతమైందని షమీ సామాజిక మాధ్యమాల వేదికగా వెల్లడించాడు. అయితే కోలుకునేందుకు ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉండటంతో అతడు ఐపీఎల్లో ఆడటం అనుమానంగా మారింది. 'నా మోకాలి శస్త్రచికిత్స విజయవంతమైంది. తిరిగి మైదానంలో దిగేందుకు ఎదురుచూస్తున్నా. అయితే కోలుకోవడానికి సమయం పడుతుంది' అని షమీ ఎక్స్ వేదికగా వెల్లడించాడు. మరోవైపు షమీ త్వరగా కోలుకోవాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహా.. సహచర ఆటగాళ్లు సోషల్ మీడియా వేదికగా ఆకాంక్షించారు.

ధ్రువ్ తార

'ధ్రువ్ జురెల్ దీక్ష చూస్తుంటే.. మరో మహేంద్రసింగ్ ధోనీ తయారవుతున్నాడని అనిపిస్తున్నది. ఒక్క సెంచరీ చేజారినా.. భవిష్యత్తులో అతడు ఇదే ఏకాగ్రతతో ఆడితే చాలా శతకాలు చేస్తాడు'

– సునీల్ గవాస్కర్

'ఇంగ్లండ్‌పై నాలుగో టెస్టు విజయం ఆనందాన్నిచ్చింది. ముఖ్యంగా యువ ఆటగాళ్లు బాధ్యత తీసుకోవడం బాగుంది. జట్టు సమిష్టిగా సత్తాచాటినా.. అందులో ధ్రువ్ జురెల్ శ్రమ ప్రత్యేకంగా ప్రస్ఫుటించింది. శాంతంగా పని ముగించే తీరు ఆకట్టుకుంది'

– సచిన్ టెండూల్కర్

ఈ రెండు ఉదాహరణలు చాలు.. ధ్రువ్ జురెల్ భారత అభిమానులపై ఎంతటి ప్రభావం చూపాడో చెప్పడానికి! జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు నేనున్నానని ముందు నిలువడం.. 'ఇప్పుడు కాకుంటే.. ఇంకెప్పుడూ? నువ్వు కాకపోతే.. ఇంకెవరూ?' అనే రాహుల్ ద్రవిడ్ సూక్తిని తూచా తప్పకుండా పాటించడం అతడికే చెల్లింది. రాంచీ టెస్టులో భారత్ పరాజయం ఖాయం అనుకున్న సమయంలో ఆణిముత్యం లాంటి ఇన్నింగ్స్ ఆడిన.. ఈ ఉత్తర ప్రదేశ్ బ్యాటర్‌పై ప్రత్యేక కథనం..

నమస్తే తెలంగాణ క్రీడావిభాగం

సంధి దశలో ఉన్న భారత టెస్టు జట్టుకు మరో ఆణిముత్యం లభించినట్లే కనిపిస్తున్నది. అజింక్యా రహానే, చతేశ్వర్ పుజారా, హనుమ విహారి వంటి టెస్టు స్పెషలిస్ట్ ప్లేయర్లు.. భారత జట్టు దరిదాపుల్లో లేకుండా పోగా.. విరాట్ కోహ్లీ వ్యక్తిగత కారణాలతో ఇంగ్లండ్‌తో సిరీస్‌కు దూరమయ్యాడు. మిడిలార్డర్ బాధ్యత మోయాల్సిన కేఎల్ రాహుల్ గాయంతో జట్టుకు దూరం కాగా.. వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోలేక శ్రేయస్ అయ్యర్, రజత్ పాటిదార్ ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి సమయంలో ఆడుతున్న రెండో టెస్టులోనే ఓ ప్లేయర్ అందరి దృష్టిని ఆకట్టుకున్నాడు. పట్టుమని పది లిస్ట్-ఏ మ్యాచ్‌లు ఆడిన అనుభవం కూడా లేని ఆ కుర్రాడు.. ఇంగ్లిష్ బ్యాటర్ల బౌలింగ్ దాడిని సమర్థంగా ఎదుర్కొంటూ పరుగులు రాబట్టాడు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 17 మ్యాచ్‌లే ఆడినా.. 50కి పైగా సగటుతో పరుగులు చేసిన అతడి ప్రతిభ.. అంతర్జాతీయ స్థాయిలోనూ పనికి వచ్చింది. మనమిప్పటి వరకు చెప్పుకుంది ఉత్తరప్రదేశ్ వికెట్ కీపర్ బ్యాటర్ **ధ్రువ్ చంద్ జురెల్** గురించే! వృద్ధిమాన్ సాహా, రిషబ్ పంత్ లేని లోటును పూడుస్తాడనుకున్న తెలుగు కీపర్ శ్రీకర్ భరత్ చేజేతులా చాన్స్‌లు చెడగొట్టుకోగా.. ఈగోకు వెళ్లిన ఇషాన్ కిషన్ అవకాశాలు చేజార్చుకున్నాడు. ఇలాంటి సమయంలో నేనున్నానంటూ ధ్రువ్ దూసుకొచ్చాడు. రాజ్‌కోట్ టెస్టు ద్వారా అరంగేట్రం చేసిన ధ్రువ్ (46; 2 ఫోర్లు, 3 సిక్సర్లు) తన ఇన్నింగ్స్‌లోనే తన బ్యాటింగ్ సామర్థ్యం ఏంటో ప్రపంచానికి చాటాడు. సహచరులు అండగా ఉన్నంతసేపు నింపాదిగా ఆడిన ధ్రువ్.. ఆ తర్వాత తనలోని విధ్వంసక ఆటగాడిని పరిచయం చేశాడు. కొలత వేసినట్లు కొట్టే బౌండ్రీలు.. హద్దులు చెరిపేసేలా బాదే సిక్సర్లు అతడి ప్రతిభను బయటపెట్టగా.. రాంచీ టెస్టుకు వచ్చేసరికి జురెల్‌లో ధాటిగా ఆడగల బ్యాటర్‌తో పాటు.. మంచి యాంకర్ కూడా ఉన్నాడని తెలిసిపోయింది. నాలుగో మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 353 పరుగులు చేయగా.. ప్రతిగా.. మన టాపార్డర్ విఫలమవడంతో 177కే 7 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఇలాంటి దశలో ఇంగ్లండ్ బౌలర్లు జోరు పెంచగా.. కుల్దీప్ అండతో ధ్రువ్ చెలరేగిపోయాడు. ఈ మ్యాచ్‌లో భారత్ తిరిగి పోటీలోకి రాగలిగింది అంటే అది ధ్రువ్ పోరాటం వల్లే అని చెప్పడంలో మాత్రం సందేహం లేదు. ఇక రెండో ఇన్నింగ్స్‌లో 192 పరుగుల లక్ష్యఛేదనలో 120కి 5 వికెట్లు కోల్పోయిన స్థితిలో క్రీజులోకి వచ్చిన ధ్రువ్.. చివరి వరకు అజేయంగా నిలిచి మ్యాచ్‌ను ముగించడంతో పాటు సిరీస్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. వ్యక్తిగత మైలురాళ్ల కన్నా జట్టు విజయానికే అధిక ప్రాధాన్యత ఇస్తానంటున్న జురెల్ ఇదే జోరు కొనసాగిస్తే.. భారత టెస్టు జట్టుకు మంచి వికెట్ కీపర్ బ్యాటర్ దొరికినట్లే!

రంజీల్లో శ్రేయస్

ముంబై: ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లో పేలవ ప్రదర్శన చేసి అనంతరం.. గాయం కారణంగా భారత జట్టుకు దూరమైన మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ రంజీ ట్రోఫీలో ముంబైకి ప్రాతినిధ్యం వహించనున్నాడు. జాతీయ జట్టుకు ఎంపిక కావాలంటే.. దేశవాళీల్లో తప్పక ఆడాలని ఇటీవల బీసీసీఐ ప్లేయర్లకు హెచ్చరికలు జారీ చేసిన విషయం తెలిసిందే. వచ్చే నెల 2 నుంచి తమిళనాడుతో జరిగే రంజీ ట్రోఫీ సెమీఫైనల్లో అయ్యర్ ముంబై జట్టు తరఫున బరిలోకి దిగనున్నాడు. ముంబై క్రికెట్ అసోసియేషన్ మంగళవారం ప్రకటించిన 16 మందితో కూడిన జట్టులో శ్రేయస్ చోటు దక్కించుకున్నాడు.

తుషార్, తనుశ్ సెంచరీలు

10, 11వ స్థానం బ్యాటర్ల అరుదైన రికార్డు

రంజీ ట్రోఫీ సెమీస్‌లో ముంబై

ముంబై: బ్యాటింగ్ ఆర్డర్‌లో 10,11వ స్థానాల్లో బరిలోకి దిగిన ముంబై బ్యాటర్లు తనుశ్ (120 నాటౌట్; 10 ఫోర్లు, 4 సిక్సర్లు), తుషార్ దేశ్ పాండే (123; 10 ఫోర్లు, 8 సిక్సర్లు) సెంచరీలతో చెలరేగడంతో ముంబై జట్టు రంజీ ట్రోఫీ సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. 1946 తర్వాత లిస్ట్ ఏ క్రికెట్‌లో చివరి రెండు స్థానాల్లో బరిలోకి దిగిన బ్యాటర్లు సెంచరీలు చేయడం ఇదే తొలిసారి. వీరిద్దరూ 10 వికెట్‌కు 232 పరుగులు జోడించడం విశేషం. 78 ఏండ్ల క్రితం సర్రే జట్టుతో జరిగిన పోరులో భారత ఆటగాళ్లు సీటీ సర్వతే (124*), ఎస్ఎన్ బెనర్జీ (121) శతకాలు బాదారు. బరోడాతో మంగళవారం ముగిసిన రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్లో ముంబై తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించి సెమీస్‌లో అడుగుపెట్టింది. ముంబై మొదటి ఇన్నింగ్స్‌లో 384 రన్స్ చేయగా.. బరోడా 348 పరుగులు చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో ముంబై 569 రన్స్ కొట్టింది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.